క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

రామచంద్రపురం: రామచంద్రపురం పురపాలక సంఘం సాధారణ సమావేశం నేటి ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎక్స్ అఫీషియో హోదాలో తొలిసారిగా హాజరవుతున్నారని తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు కృషి


అంగరలో క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ ప్రక్రియను గ్రామస్థాయి పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిశీలించారు. క్లోరినైజేషన్ చేసే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అంగర, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లోని ఆర్వో ప్లాంట్లలోని తాగునీరు నాణ్యతను పరిశీలించారు. గ్రామాల కార్యదర్శులు, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామ క్షేత్రంలో వార్షిక మహోత్సవాలు

మండపేట: పట్టణంలోని బురుగుంట చెరువు సమీపాన ఉన్న సీతారామ క్షేత్రంలో ఏడవ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్షేత్రంలో కొలువు తీరిన మహాగణపతి, మహాలక్ష్మి, సీతారామ చంద్రమూర్తులతో పాటు సాయినాథులు గత ఏడు సంవత్సరాలుగా భక్తుల నీరాజనాలు అందుకుంటూ ప్రసిద్ధి గాంచారు. వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివార్లకు అమ్మవార్లకు అభిషేక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మల్లిపూడి కొండయ్య, వెంకటేశ్వరరావు, మల్లిపూడి గణేశ్వరరావు, వేగుళ్ల పుష్పరాజు, చంద్రు శ్రీవరప్రకాష్‌లతో పాటు కె.సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ వరదాచార్యులు శ్రీమాన్ రంగనాథచార్యులు శ్రీమాన్ శివానందలహరి శ్రీమాన్ అనంత భరద్వాజు ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి.

ఎమ్మెల్యే వేగుళ్లకు అభినందన

మండపేట: మండపేట పట్టణ జామియా మస్జిద్, ఆమీనా మస్జిద్, అక్సా మస్జిద్, హంజా మస్జిద్ ఇమాములు, కమిటీ సభ్యులు, జమాత్, ముస్లింలు కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను గెలిచిన తర్వాత మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు సల్మాన్ హుస్సేన్, ఎండీ అతావుర్ రెహ్మాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎండీ రంగరాజుకు ప్రతిష్ఠాత్మక అవార్డు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలేనికి చెందిన ఎన్‌సీసీ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రంగరాజు(హైదరాబాద్), ప్రతిష్ఠాత్మకమైన ఇండియాస్ ఇంపాక్ట్‌ఫుల్ లీడర్ అవార్డును దక్కించుకున్నారు. ఆయన తరఫున పై అవార్డును డైరెక్టర్(రవాణా)వినోద్ కుమార్ యాదవ్ స్వీకరించారు. ఈ నెల 27న ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్‌లో డాక్టర్ సంజయ్ కొల్టే(సీఎండీ), పూణె మహానగర్ పరివాహన్ మహామండల్ లిమిటెడ్(పీఎంపీఎంఎల్) నుంచి ఈ అవార్డును యాదవ్ తీసుకున్నారు. రంగరాజు అంకితభావానికి, వినూత్న నాయకత్వానికి నిదర్శనంగా(ఎక్స్‌లెన్స్, లీడర్‌షిప్ ఇన్ ది ఇన్‌డస్ట్రీ)పై అవార్డు నిలిచింది. రంగరాజుకు అవార్డు రావడంపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌రావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు, సింగరేణి కాలరీస్ డీజీఎం(పర్సనల్) ఆర్‌సీవీ రాజు అభినందనలు తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సంహిత డిగ్రీ కాలేజీలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాకు 235 మంది హాజరు కాగా ఒక కంపెనీకి 74 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో సంహిత విద్యాసంస్థల చైర్మన్ దినేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాజా ఆహారం.. ఆరోగ్య మంత్రం

- వానాకాలం జాగ్రత్తలు తప్పనిసరి
- మాంసాహారం మానేయడం మేలు
- పౌష్టికాహారంపై అవగాహన అవసరం
- కల్తీ పదార్థాల విక్రయాలు ప్రమాదకరం


మండపేటలో విక్రయించిన బిర్యానీలో బొద్దింక (ఫైల్)


అంగర ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో పదార్థాలను తనిఖీ చేస్తున్న వీఆర్వో వీరరాఘవులు (ఫైల్)


కూరగాయలు

కపిలేశ్వరపురం: ప్రతిఒక్కరూ జానెడు పొట్టను నింపుకోవడానికి ఎంతో కష్టపడతారు. ఎంత కష్టపడినా మనం తినే తిండిపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. తినే ఆహారం తాజాగా ఉండాలి, శరీరం జీర్ణం చేసుకునేదై ఉండాలి. వానాకాలంలో తీసుకునే ఆహారం జీర్ణమై బలం చేకూర్చేలా ఉండాలి. అటువంటి ఆహార పదార్థాలే తీసుకోవాలి. అయితే ఆహార పదార్థాలు, శరీర తత్వాలను బట్టి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యం పరిస్థితులు మెరుగుపడతాయంటున్నారు ఆరోగ్యాభిలాషులు. వానాకాలం ఆహార జాగ్రత్తలపై ఈ కథనం..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో విస్తారంగా రెస్టారెంట్లు, హోటళ్లు ఉన్నాయి. పల్లెల్లో సైతం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఎన్నో ఉన్నాయి. ఆయా కేంద్రాల ద్వారా వేలాది మంది మాంసాహార, శాఖాహార పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. 2023 ఆగస్టు 27న మండపేట పట్టణంలోని ఓ బిర్యానీ పాయింట్‌లో తాపేశ్వరానికి చెందిన యువకుడు బిర్యానిని కొన్నాడు. పార్శిల్‌ను తిందామని ఇంటికెళ్లాకా తెరవగా బిర్యానీతో పాటు బొద్దింక దర్శనమిచ్చింది. పట్టణంలోని మరో హోటల్‌లో సాంబార్‌లో బల్లిపడిన ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. 2021 జూలైలో రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో ఆహార తయారీ, నిల్వ, రవాణా కేంద్రాలపై జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి ఆహార పదార్థాలు, నెయ్యి, నూనె తదితర సరకుల నమూనాలను సేకరించి పరీక్షించారు. రుచులు కోసం అశాస్త్రీయమైన పదార్థాలను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు, ఆహార సంబంధిత సరకుల విక్రయదారులు తప్పనిసరిగా ఆహార భద్రతా నియమావళి ప్రకారం ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ యాక్ట్–2006లోని సెక్షన్ 206 ప్రకారం చర్యలు ఉంటాయి. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్ష, రూ.5 లక్షలు వరకూ జరిమానా విధిస్తారన్న హెచ్చరికలున్నాయి.

మాంసాన్ని భుజిస్తే వచ్చే ఇబ్బందులు ఇవీ..

వర్షాకాలంలో పశువులకు పలు ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. వాతావరణ మార్పులు వల్ల మాంసం తిన్న వారిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్ కలగడం ద్వారా అజీర్తి, విరేచనాలు, జ్వరం రావడం వంటి సమస్యలు సహజంగా తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యానికి ఆలస్యమైతే ప్రమాదం పొంచి ఉంటుంది.

జంక్ ఫుడ్‌తో జర జాగ్రత్త

ఆహార పదార్థాల తయారీలో రుచి, ఆకర్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. అందుకోసం ఆహారం తయారీలో అసెన్స్, రంగులు కలుపుతారు. 2020 అక్టోబర్ 2న వీఆర్‌పురం మండలం బూరుగువాడ గ్రామంలో తినుబండారాలు వికటించి 11 మంది చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం అందరికీ తెలుసు. అది ఒక హెచ్చరికలాంటిది.

కాలనుగుణంగా ఆహారం తినాలి



వర్షాకాలంలో త్వరగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తినడం మేలు. క్రిమి కీటకాదుల ప్రభావంతో ఇతర ఆరోగ్య సమస్యలూ తలెత్తే అవకాశాలున్నాయి. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడం ద్వారా ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చు.

– డాక్టర్ పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

ప్రకృతి ఆహారంలో పోషక విలువలిలా..

ప్రకృతి సిద్ధమైన కూరగాయలు, పండ్లు, గింజలను ఆహారంగా తీసుకోవడం బలవర్థకమే కాకుండా అరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. వంద గ్రాముల ప్రమాణంలో పోషకవిలువలిలా ఉంటాయి. అరటి, చిక్కుడులలో సుమారుగా 90 కేలరీల శక్తి ఉంటుంది. క్యారెట్, కాలిఫ్లవర్, మునగ, కాకరకాయ, గుమ్మడి, కాకరకాయ, వంకాయ, టమాటాలలో 30 కేలరీలు, బీరకాయ, గోరు చిక్కుడులలో 20 కేలరీలు శక్తి లభిస్తుంది. ఆకు కూరల్లో కర్వేపాకు, పొన్నగంటిలలో 100 కేలరీలు, గోంగూర, మెంతికూర, పుదీన, తోటకూర, కొత్తిమీర, బచ్చలిలలో 50 కేలరీలు, పాలకూర, చుక్కకూరలలో 15 కేలరీలు ఉంటాయి. గ్రీన్ ద్రాక్ష, రేగిపండు, దానిమ్మ, నేరేడు, ఆపిల్‌లలో 70 కేలరీల శక్తి లభిస్తుంది. నల్లద్రాక్ష, జామ, కమలాపండు, అనాసపండు, బత్తాయి, బొప్పాయిలలో 50 కేలరీలు, రాగులు, సజ్జలు, పెసలు, గోదుమల్లో సుమారుగా 350 కేలరీల శక్తి లభిస్తుంది.

మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీలు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యలతను అడిగి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పట్టణంలోని విద్యా సంస్థలను ఆకస్మిక తనికీ చేశారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలను మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ కేసీ సత్యలతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధికారులు, ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం, కళాశాల పూర్వ విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా తాను కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఏ విధంగా అందుతుందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని మరింత మెరుగ్గా విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను మంత్రి సుభాష్ తనిఖీ చేశారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ రికార్డులను తనిఖీ చేశారు. కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, శానిటైజేషన్ పనుల గురించి ఆరా తీసి అక్కడ ఉన్న అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ నేతలు మేడిశెట్టి శేషారావు, రవ్వా భూషణం, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు సమయానికి ఉండేలా చూడాలని పై అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఫొటోలను ఏర్పాటు చేయాలని సూచించారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

రామచంద్రపురం రూరల్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, విద్యతోనే సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని సమగ్ర శిక్ష ఏఎంఓ పిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో శుక్రవారం నేడు బడికి పోతా, విద్యా ప్రవేశ్ కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి రాంబాబు మాట్లాడుతూ బడి ఈడు చిన్నారులందరూ బడిలో చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నేను బడికి పోతా, విద్యా ప్రవేశ్ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులందరూ బడిలో చేరే విధంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆటపాటలతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు జుత్తుగ విజయలక్ష్మిప్రసన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాదా శ్రీరాములు ఇద్దరినీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పులిదిండి నాగరాజు, కోఆప్టెడ్ సభ్యుడు బుంగ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం, షూస్

అంబాజీపేట: స్టూడెంట్ కిట్‌లలో భాగంగా విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫామ్, షూలు, బ్యాగ్‌లను మండలంలోని ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ–1 కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం నుంచి మండలానికి వచ్చిన స్టూడెంట్స్ కిట్లను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో తరగతి వరకూ సుమారు 3,530 మంది విద్యార్థులకు యూనిఫామ్, షూలు, బ్యాగ్‌లను త్వరలో అందజేస్తారన్నారు. మండలంలో హైస్కూళ్లు 9, ప్రాథమిక పాఠశాలలో 55 పాఠశాలల్లో 3,530 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు.

అధ్వానంగా కొత్త కాలనీ రహదారి


చెదురుమదురు వర్షాలకు బురదగా మారిన మొగలిపాలెం కొత్తకాలనీ రహదారి

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం కొత్త కాలనీ రహదారి అధ్వానంగా తయ్యారయింది. గత మూడు రోజులుగా చెదురుమదురుగా కురుస్తున్న వర్షపు జల్లులకు బురదగా మారింది. దీంతో ఇళ్లలోని ప్రజలు బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు. సుమారు 12 ఏళ్ల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో ఈ రహదారిపై మెటల్‌రోడ్ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి మరమ్మతులకు సైతం నోచుకోకపోవడంతో ప్రస్తుత వర్షాలకు బురదగా మారిందని సైకిళ్లు, మోటారుసైకిళ్లు ప్రయాణించేందుకు వీలు లేకపోవటంతో కాలినడకన గ్రామంలోకి వెళుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కౌన్సిలర్ రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న ఆశా వర్కర్లు

మండపేట: మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యలో శుక్రవారం ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన చేశారు. వర్షాకాలంలో వచ్చే వైరల్ జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదే విధంగా ఇళ్లల్లో కూడా ఎప్పుడూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలు పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఏ మాత్రం, శరీరంలో ఏ మాత్రం అనుమానం ఉన్నా డాక్టరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. తాజా వండి వార్చిన ఆహార పదార్థాలను తీసుకోవాలని వివరించారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆదేశాల మేరకు వార్డులో అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయాలి

ఎమ్మార్పీఎస్ నేత దూలి జయరాజు డిమాండ్



మండపేట: అర్హులైన వారందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు దూలి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తొలగించిన పింఛన్లను, రేషన్ కార్డులను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి ఆదుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎంతో మంది అర్హులకు రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలపై ఆధారపడి జీవించే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇలా ఎంతో మంది ఉన్నారన్నారు. వారిలో కొంతమందికి రేషన్ కార్డు ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. అటువంటి వారందరినీ ప్రభుత్వం గుర్తించి రేషన్ కార్డులు, పింఛన్లు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన ప్రజాబలం వేదిక నుంచే రేషన్ కార్డు రద్దు కారణంగా ప్రభుత్వ పథకాలను పథకాలను కోల్పోయిన పేద వర్గాల అందరికీ అధికారంలోకి రాగానే తిరిగి పునరుద్ధరిస్తారని స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మండపేట వేదికగా ఇచ్చిన హామీకి కట్టుబడి పనిచేయాలని జయరాజు కోరారు.

జర్నలిస్ట్ కుటుంబానికి మంత్రి పరామర్శ


జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శనరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: మండలంలోని చేదువాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శనరావు కుటుంబీకులను రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. సుమారు 28 ఏళ్లుగా పత్రికారంగం ద్వారా సమాజానికి సేవలందిస్తున్న సుదర్శనరావు గత 10 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆ సమయంలో అమరావతిలో ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ పనుల్లో బిజీగా ఉన్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫోన్‌లో పరామర్శించి సుదర్శనరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంత్రి సుభాష్ కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు చందాల వీవీ సత్యనారాయణ(బాబి), దేగల సతీష్, రెడ్డి శేషారావు, గెద్దాడ సత్తిబాబు, శ్రీనివాసు, గుబ్బల నాగేంద్రకుమార్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి

అయినవిల్లి: సచివాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చే సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిపారు. సమావేశంలో ప్రజలు, ప్రజాప్రతినిధులతో మమేకమై పనిచేయాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ఫించన్ల పంపిణీ, సీజనల్ వాధ్యులపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజాదర్బారుకు వచ్చిన సమస్యలపై స్పందన, హౌస్ హోల్డ్ సర్వే మొదలకు అంశాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తీయాలని వినతి


గుర్రపుడెక్క, చెత్తతో నిండిపోయిన రామచంద్రుడు కాలువ

మండపేట: వందలాది ఎకరాలకు సాగునీరు అందించే రామచంద్రుడు పంటకాలువ చెత్తాచెదారాలతో పూర్తిగా మూసుకుపోయిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామచంద్రుడు పంటకాలువ పూర్తిగా మూసుకుపోయి ఉందా లేదా అన్నట్టుగా ఉందని, గుర్రపుడెక్క, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్స్, నివాసాల నుంచి వెలువడిన వ్యర్థాలు అందులో పారేయడంతో ఈ కాలువ మూసుకుపోయిందన్నారు. ఈ కాలువపై ఎంతో మంది ఆధారపడి వున్నారని అన్నారు. పెద్దకాలువ నుంచి రామచంద్రుడు కాలువ ద్వారా నీరు సరఫరా అయితేనే పొలాలకు నీరందుతుందన్నారు. చుట్టు పక్కల అంతా ఖరీఫ్ పంట పనులు ఆరంభమైనప్పటికీ రామచంద్రుడు కాలువ గుర్రపుడెక్క ఇతర వ్యర్థాలతో పేరుకుపోవడంతో సాగునీరు శివారు వేగంగా ప్రవహించడం లేదన్నారు. దీనివల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ సమస్యపై తక్షణం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించి కాలువను వెంటనే శుభ్ర పరిచి సాగునీరు అందివ్వాలని ఈ సందర్భంగా కోన సత్యనారాయణ డిమాండ్ చేశారు.

వైభవంగా బూరుగులమ్మ తీర్థం


బూరుగులమ్మ అమ్మవారు

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన గ్రామ దేవత బూరుగులమ్మ తల్లి తీర్థం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మివారికి గ్రామ ఆడపచులు ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించారు. అంతకు ముందు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గురువారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్స్‌లు, తీన్‌మార్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా గంగమ్మ జాతర

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో యాదవుల వంశ ఆరాధ్య దైవం అయిన భాగిత్తమ్మ(గంగమ్మ) జాతర శుక్రవారం ఘనంగా జరిపారు. బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలు, కొమ్ము బూరలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం గంగమ్మతల్లికి విశేష పూజలు జరిపారు. ప్రజలు పశుసంపద, పాడి పంటలతో తులతూగాలని యాదవులు ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం


దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన రాజకొండలరావు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,001 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీ ప్రీస్కూల్స్‌కు పిల్లలను పంపించండి

సఖినేటిపల్లి: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పంపాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి కోరారు. శుక్రవారం ఉయ్యూరువారి మెరక అంగన్‌వాడీ సెంటర్‌లో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది రా, కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ, ప్రీస్కూల్స్ నందు మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ గుబ్బల అంజిబాబు, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ అధికారి వాణి, మహిళా పోలీసులు మీనాకుమారి, సూజన్, టీచర్లు రత్నకుమారి, నందిని, పద్మావతి, శేషవేణి, జ్యోతి విజయలక్ష్మి, పార్వతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

3న అప్పనపల్లిలో చాగంటి ప్రవచనం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో జూలై 3న ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేశామని ఆలయ ఈవో గ్రంధి మాధవి శుక్రవారం తెలిపారు. 3వ తేదీ బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు వేంకటేశ్వర వైభవం అనే అంశంపై చాగంటి ప్రవచనం జరుగుతుందన్నారు. భక్తులు ఈ ప్రవచనం కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.